శ్రేయస్కరం

సింహం



"అబ్బ! ఈ వెధవ సిగరెట్లు మానేద్దురూ !"

లలిత కోపంగా నా చెయ్యి పట్టుకుని ఆపింది. ఆ చేతిలో సిగరెట్టుంది. ఎమర్జెన్సీలో ప్రభుత్వాధికారిలాగ వెలుగుతోంది.

"మానేస్తాను. ఇదే ఆఖరి సిగరెట్టు." అన్నాను చిన్నగా నవ్వుతూ.

"ఈ మాట ఇప్పటికి వెయ్యిసార్లన్నారు." ఉడుక్కుంది లలిత.

నిజమే! నేను చాలాసార్లు సిగరెట్లు మానెయ్యమని లలిత చేత అడిగించుకున్నాను. అన్నిసార్లూ మానేస్తానని వాగ్దానం చేసాను. కాని ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకో లేకపోయాను.

పెళ్ళయిన ఈ ఆరేళ్ళలోను నేను లలితకి వాగ్దానం చేసి నెరవేర్చుకోలేకపోయినది ఒక్క ఈ సిగరెట్టు విషయంలో మాత్రమే!

ఈ విషయంలో లలిత నాతో చాలాసార్లు దెబ్బలాడింది.

"తల్లిదండ్రుల అలవాట్లు పిల్లలకి కూడా వస్తాయి. అప్పుడే మన మురలిగాడు నాన్నగారు సిగరెట్టు ఇలా కాలుస్తారు అంటూ రెండువేళ్ళు నోటి దగ్గిర పెట్టుకుని ఏక్షన్ చేసి చూపిస్తున్నాడు."

నాకు నవ్వొచ్చింది. నాలుగేళ్ళ మురళి వాళ్ళ నాన్న లాగ ఏక్టు చేస్తున్నాడంటే !

"మీకు నవ్వులాటగానే వుంటుంది."

అని నా చేతిలోంచి సిగరెట్టు తీసి కిటికీలోంచి బైటకి విసిరేసింది.

లలిత తెలివితక్కువతనానికి నాకు నవ్వొచ్చింది. ఎందుకంటే వేళ్ళమధ్యనున్న సిగరెట్టు విసిరేసిందే గాని చేతిలో వున్న సిగరెట్టు పెట్టె మాత్రం లాక్కోలేదు.

లలితని మరికొంతసేపు ఆటపట్టించాలనిపించింది.

"మరి మా నాన్నగారికి సిగరెట్టు అలవాటు లేదు. నాకెందుకలవాటయింది ?"

"మీరు అలవాటు చేసుకున్నారు."

"మా నాన్నగారు అప్పుడప్పుడు మందు సేవించేవారు. అది నాకెందుకలవాటవలేదు మరి ?"

"అలవాటవకేం ? అప్పుడప్పుడు పుచ్చుకుంటూనేవున్నారు గదా !"

లలిత గొంతులో నిస్సహాయత ధ్వనించింది.

ఆ విసురు నాకు చురకలాగ తగిలింది.

నిజమే.

ఈమధ్య నేను అప్పుడప్పుడు పార్టీల పేరుతోను, పిక్నిక్కుల పేరుతోను తాగుతున్నాను.

కాని అది అలవాటు కాదు. జస్ట్ ఫర్ కంపెనీ సేక్, అంతే.

నా ఉద్యోగంలో నాకది తప్పదు మరి.

నేను ఇప్పుడు పనిచేస్తున్న కంపెనీలో మొదట్లో చాలా చిన్న ఉద్యోగంలో చేరేను.

నా తెలివితేటలతో, స్వయం కృషితో, సిన్సియారిటితో ప్రమోషన్లు సంపాదించుకున్నాను.

మెసెంజరు కేడరు నుండి అసిస్టెంటు కేడరుకి ఎదిగినప్పుడు నేనిచ్చిన పార్టీ కేవలం స్వీటు, హాటు, ఒక సిగరెట్టు — అంతే.

అప్పటి నుండీ నాకీ సిగరెట్టు అలవాటయింది.

అప్పుడే నేను లలితని పెళ్ళి చేసుకున్నాను.

లలిత చాలా బీద కుటుంబం నుండి వచ్చింది.

లలిత తండ్రి ఏదో ఉద్యోగం చేసేవాడు. కాని అతని కుటుంబం మాత్రం నేనిచ్చే ఇంటద్దెతోనే బ్రతికేవారు. ఆ సంగతి చాలా రోజుల వరకు నాకు తెలీదు. తెలిసాక అద్దె మరో యాభై రూపాయలు ఎక్కువివ్వడం మొదలెట్టాను.

దాంతో వాళ్ళ కుటుంబానికి నాకు సాన్నిహిత్యం పెరిగింది.

అప్పుడే లలితతో నా పరిచయం కూడా పెరిగింది.

చాలా సార్లు వాళ్ళ కుటుంబానికి నేనెలా సాయపడగలనా అని ఆలోచించేవాడిని.

లలిత తల్లిదండ్రులకి ఒక్కర్తే ఆడపిల్ల. కాని లలిత తరువాత నలుగురు మగపిల్లలున్నారు. అందులో పెద్దవాడు టెంతు పాసయి రోడ్లమీద తిరుగుతున్నాడు. ఒకటి రెండుసార్లు రోడ్లమీద చీట్లపేక ఆడుతూ కన్పించాడు. ఆ సంగతి వాళ్ళమ్మగారితో చెబితే "అంతా ఆ తండ్రి లక్షణాలే అబ్బుతున్నాయి నాయనా!" అంటూ ఆవిడ నా ముందు వాపోయింది. చూస్తూ వూరుకోలేక మా కంపెనీలోనే ఉద్యోగం వేయించాను. కాని అతను దాన్ని నిలబెట్టుకోలేదు. ఉద్యోగం ఆసరాతో మరిన్ని అప్పులు చేసి మరీ పేకాట ఆడడం ప్రారంభించాడు. చేసేదిలేక ఊరుకున్నాను

అప్పుడే లలితని పెళ్ళి చేసుకోవాలనిపించింది.

లలిత చాలా నెమ్మదస్తురాలు. తెలివైనది అన్ని విధాలా నాకనుకూలవతి.

అందుకే వాళ్ళ తల్లిదండ్రులతో మాట్లాడి లలితని రిజిష్టర్డ్ మ్యారేజి చేసుకున్నాను.

ఆ విధంగా వాళ్ళ కుటుంబానికి నేను కొంత సాయపడ్డాననిపించింది.

తరువాత నాకు ప్రమోషను, దానితోబాటు ట్రాన్స్ఫరు కూడా వచ్చింది.

నేను మా కంపెనీ సేల్సు మానేజరును. నా ఉద్యోగరీత్యా నేను చాలామందిని కలవాలి, పరిచయాలేర్పరచుకోవాలి, స్నేహాలు పెంచుకోవాలి. ఆ సందర్భంలో వాళ్లతోబాటు అప్పుడప్పుడు తీర్థం సేవిస్తూ వుండాలి.

కాని ఆ విషయం లలితకి తెలియకుండా కొన్నాళ్లు దాచిపెట్టాను.

తెలివైన లలిత నన్నెంతోకాలం ఇబ్బంది పెట్టకుండానే తెలుసుకుంది.

తెలిసాక తల బాదుకుంది.

తన తండ్రి ఈ అలవాటుకి బానిసయే సంసారాన్ని సర్వనాశనం చేసాడని ఏడ్చింది.

నాకున్నది అలవాటు కాదని లలితకి నచ్చజెప్పటానికి నేను చాలా శ్రమపడవలసి వచ్చింది.

అక్కడి నుండి లలిత సందర్భం వచ్చినప్పుడల్లా నా అలవాట్లు ఎత్తిచూపి నన్ను ఎలర్టుచేస్తూ వుండేది.

నేను నా ఉద్యోగంలో బాగా అభివృద్ధిలోకి వస్తున్నాను.

నా ఉద్యోగ నిర్వహణలో నేను చాలా రోజులు సంసారాన్ని పట్టించుకోలేదు.

ఓ రోజు ఉదయాన్నే స్నానం చేసి వస్తూ వుంటే డ్రాయింగు రూములో మురళిగాడు సిగరెట్టు కాలుస్తూ కనబడ్డాడు. అప్పుడు వాడికి పదేళ్లు.

నేనంతకుముందు కాల్చిపారేసిన సిగరెట్టుపీకని గోడవారగా నిలబడి దమ్ము లాగేస్తున్నాడు.

వెనుకనుండి వెళ్ళి కాలరు పట్టుకున్నాను.

నన్ను చూడగానే బిక్కచచ్చిపోయాడు.

వాడిమొహం చూస్తే ఇంక దండించక్కర్లేదనిపించింది. భయంచెప్పి వదిలేసాను.

కాని ఇదంతా లలిత చూడనే చూసింది.

నామీద విరుచుకుపడింది.

నేను సౌమ్యంగా నచ్చజెప్పాను.

"చూడు లలితా! నువ్వు అనవసరంగా లేనిపోనివి ఊహించుకుని భయపడిపోతున్నావు. చిన్నప్పుడు నేను మా అమ్మ దుకాణానికి వెళ్లమంటే అయిదు పైసలిస్తేనేగాని వెళ్లనని మారాం చేసేవాడిని. అదిచూసి మా నాన్న వీడు పెద్దయ్యాక లంచగొండి అవుతాడే అనేవాడు. అలాగని నేనిప్పుడు లంచగొండినయానా! అలాగే వాడుకూడాను!"

నా సమర్థింపుని లలిత నమ్మకపోయినా మరి నాతో వాదన పెట్టుకోలేదు.

నా కృషివలన మా కంపెనీకి మంచి లాభాలు వచ్చాయి.

నేనిప్పుడు మా కంపెనీ జనరల్ మేనేజరుని.

నా జీవితంలో నేననుకున్నది సాధించాను.

మా మురళి కాలేజి మెట్లెక్కాడు.

ఓ రోజు కారులోవస్తూ చూసాను.

మురళి కాలేజి బయట ఫ్రెండ్సుతో నిలబడి వున్నాడు.

చేతిలో సిగరెట్టు వుంది.

నాకు లలిత మాటలు గుర్తుకువచ్చాయి.

కాని మురళిని దండించే వయసు దాటిపోయింది.

అందుకే కామ్‌గా ఊరుకుండిపోయాను.

నేను మా కంపెనీకి కొత్త జనరల్ మ్యానేజరుని.

బీయస్‌గా నేను మా కంపెనీకి చెయ్యవలసినది చాలా వుంది.

ఆ సందర్భంగా ఈ మధ్య రెండు మూడు పార్టీలు ఇంట్లోనే ఇవ్వవలసి వచ్చింది.

ఇంట్లోనే పార్టీ ఇవ్వడం లలిత కెంత మాత్రం ఇష్టం లేదు.

నాకు నెమ్మదిగా తాగడం అలవాటయింది. తాగడం నా దినచర్యలో ఒక భాగమయింది. సొసైటీలో నా స్టేటసుకి తగ్గ అలవాటుగా అది ప్రకాశించిందే గాని నాకేమీ చెడ్డపేరు తేలేదు.

నా విధి నిర్వహణలో కుటుంబాన్ని పట్టించుకోకుండా వదలి వెయ్యడం నాకు ముందు నుండే అలవాటయింది.



ఓ రోజు మధ్యాహ్నం నేను చాలా బిజీగా వున్నాను.

మా కంపెనీకి ఫారిన్ నుండి ఒక పార్టీ వచ్చింది. ఆ పార్టీతో మేమొక ఎగ్రిమెంటు కుదుర్చుకోవలసి వచ్చింది. ఆ సందర్భంగా ఆ సాయంత్రం ఊళ్ళో వున్న ఒక పెద్ద హోటలులో పార్టీ కూడా వుంది. నేనా హడావుడిలో వున్నాను.

ఇంతలో ఇంటివద్ద నుండి ఫోను వచ్చింది. నౌకరు చేసాడు.

మురళి తప్పతాగి బ్రోతల్ హౌసులో ఒక వ్యక్తిని దారుణంగా పొడిచి చంపేసాడట. ఈ హత్యలో మురళితో బాటు అతని ఫ్రెండ్సు కూడా వున్నారట.

ఆ వార్త విన్న లలిత స్పృహ తప్పి పడిపోయిందట.

నా చేతి లోంచి రిసీవరు జారి క్రింద పడిపోయింది.

అచేతనుడినయి కుర్చీలో కూలబడి పోయాను.

"పిల్లలు క్రమశిక్షణతో పెరగాలంటే ముందు పెద్దలు క్రమశిక్షణ పాటించాలండి."

లలిత మాటలు నా చెవుల్లో గింగుర్లెత్తి కర్ణభేరి బద్దలయి పోతుందేమోనన్నట్లుగా వినిపించసాగాయి. ★